
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

బాపట్ల జిల్లా వార్తలు

మంగళవారం 1 జూలై 2025

రోగుల కృతజ్ఞతే సంతృప్తి

- ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవం డాక్టర్
- రోగికి, వైద్యులకు ప్రత్యేకమైన అనుబంధం
- వైద్య వృత్తిపై మక్కువతో వైద్యుల సేవలు.. నేడు వరల్డ్ డాక్టర్స్ డే..

8



పురుగుల బియ్యం.. ప్రభుత్వం సీరియస్



బియ్యంలో పురుగులు పాకుతున్నా ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం (పాత చిత్రం)

- ఐదుగురు సిబ్బంది సస్పెన్షన్
- గోదాము మేనేజర్‌పైనా చర్యలకు ఆదేశం
- కొనుగోళ్లలో అవకతవకలే
- కారణమని ప్రాథమిక నిర్ధారణ
- సమగ్ర విచారణకు ప్రత్యేక బృందం


తెనాలి, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఉండటంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాములో పనిచేసే టెక్నికల్ సిబ్బంది, ఇతర అధికారులు కలిపి మొత్తం ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేసింది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. గోదాము మేనేజర్‌పై చర్యలకు ఆదేశించడంతో పాటు, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని చిన్నారులకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బియ్యంలో పురుగులు ఉండటం, అవి తిరుగాడుతుండగానే ప్యాకింగ్ చేసేస్తుండటంపై ఈ నెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. ముక్కు పురుగులు సంచుల నిండా ఉన్నా.. వాటిని అలానే.. పాఠశాలలకు పంపేందుకు ప్యాకింగ్ చేసి, సిద్ధం చేశారు. దీనిపై సమాచారం అందడంతో ఆంధ్రజ్యోతి పరిశీలించింది. పురుగులు ప్రత్యక్షంగా కనిపించడం, నాణ్యమైన బియ్యం స్థానంలో నాసిరకం బియ్యం కొనుగోలు చేయడం.. ఇందులో భారీ మొత్తంలో మామూళ్ల రూపంలో డబ్బు చేతులు మారడం తదితరాలు వెలుగులోకి రావడంతో.. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను తక్షణ పరిశీలనకు మంత్రి మనోహర్ ఆదేశాలిచ్చారు. ఉన్నతాధికారులు తెనాలి గోదాములో బియ్యం నిల్వలను పరిశీలించారు. వారికి కూడా పురుగుల మయమైన బియ్యం కనిపించడంతో.. నాశిరకం బియ్యం కొనుగోళ్ల కారణంగానే ఈ లోపం జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బియ్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఎస్.డబ్ల్యుసి గోదాముల టెక్నికల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తేల్చారు.దీనిపై సమగ్ర విచారణ కోసం విజయవాడ నుంచి ఒక ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు తెలిసింది. వారు దీనిపై విచారణ జరిపి, లోపం ఎక్కడ జరిగింది? అవకతవకలకు పాల్పడిన సిబ్బంది ఎవరనేది తేల్చాల్సి ఉంది. ఇప్పటికే విచారణ కూడా మొదలుపెట్టినట్టు సమాచారం. త్వరలో పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. ఆ తర్వాతే చేతివాటం చూపిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



సన్నగిల్లుతున్న లక్ష్యం

మధ్యాహ్న భోజనానికి పురుగుల బియ్యం

సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన పురుగుల బియ్యంపై ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



ఆగంతకులకు రాచమార్గం

- ఈఎఫ్‌టీలోనే అసలు తంటా
- రెల్వే ప్రయాణికుల భద్రత గాలిలో దీపం
- రైళ్లలో దోపిడీలకు టీటీఈలే పరోక్ష కారణం ?

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలోని రిజర్వేషన్ బోగీల్లో భద్రత గాలిలో దీపంలా మారింది. వరుస చోరీలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. దీనంతటికీ పరోక్ష కారణం.. టీటీఈల చేతివాటమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే స్లీపర్, ఏసీ త్రీటైర్ బోగీల్లో ఆగంతకులు దర్జాగా ప్రయాణిస్తున్నారు. ఈ విధానానికి అడ్డుకట్ట వేయాల్సిన రైల్వే శాఖ.. అందుకు విరుద్ధంగా ఆదాయమే పరమావధిగా వ్యవహరిస్తోంది. రిజర్వేషన్ లేని వాళ్లకు ఫైన్లు వేసి మీ ఇష్టం వచ్చిన చోట కూర్చోమని ఈఎఫ్‌టీ(ఎక్సెస్ ఫేర్ టిక్కెట్) రాసి టీటీఈ చేతిలో పెడుతున్నారు. దీనిని అవకాశంగా చేసుకొంటున్న దోపిడీ దొంగలు అర్ధరాత్రి ప్రయాణికులందరూ నిద్రలోకి జారుకున్నాక తమ ప్రతాపం (మిగతా 8వ పేజీలో)

సాగు నీరు విడుదల ఎప్పుడో

- ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం



నారుమడి పోసేందుకు సిద్ధంగా ఉన్న పొలం

అమృతలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమడెల్టా కాల్వలకు సాగు నీటి విడుదల ఎప్పుడని రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది జూలై మొదటి వారంలోపే నీటిని విడుదల చేశారు. కానీ, ఈ ఏడాది నీటి విడుదలపై ప్రభుత్వం ఇంత వరకు ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉన్నా.. విడుదల ఆలస్యంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు వాతావరణం అనుకూలతతో ఎదసాగు చేపట్టారు. కొన్ని రోజులుగా వర్షం పడకపోవడంతో వీరు కూడా నీటి తడి ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. నారుమళ్లు పోసేందుకు సిద్ధమైన రైతులు కూడా.. నీటి విడుదల తేదీ ఖరారు కాకపోవడంతో సందిగ్ధతో ఉన్నారు. నీటి విడదల ఆలస్యమైతే.. ముదురు నాట్లు, లేత నాట్లు వేసే రైతులు అందరూ ఒకేసారి నాట్లు వేయాల్సి వస్తుందని దీంతో కూలి రేట్లు కూడా విపరీతంగా పెరు గుతాయని వాపోతున్నారు. వెంటనే నీటి విడుదల చేపడితే తమకు మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు.



- రిజర్వాయర్‌కు ఒక వైపున పూర్తైన ఫస్ట్ లేయర్ ఫౌండేషన్

వరద నీటి నిర్వహణ

పర్యాటక ఆకర్షణ

వేగంగా సెంట్రల్ పార్కు రిజర్వాయర్ పనులు

- పూర్తయిన పూడిక తీత
- తుది దశకు ఫస్ట్ లెవెల్ ఫౌండేషన్
- వర్షాలకు నీరు చేరకుండా జాగ్రత్తలు
- చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన వరద నీటి నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శాఖమూరులో నిర్మిస్తున్న సెంట్రల్ పార్కులోని 50 ఎకరాల కొండవీటి వాగు రిజర్వాయర్ పూర్తికావొస్తోంది. వర్షాలు పడుతున్నప్పటికీ పనులు ఆగకుండా ఎప్పటి కప్పుడు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. కేవలం రిజర్వాయ ర్‌గానే కాకుండా.. ఒక పర్యాటక ప్రాంతంగా దీనిని తీర్చిదిద్దేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లను సీఆర్డీఏ చేస్తోంది.

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని శాఖమూరు గ్రామంలో నిర్మిస్తున్న 300 ఎకరాల సెంట్రల్ పార్కులో కొండవీటి వాగు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, సీఆర్డీఏ నిర్ణయించింది. కొండవీటి వాగు వరద నీటి నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఈ రిజర్వాయర్‌ను సెంట్రల్ పార్కులో ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటక ఆకర్షణగా ఉంటుందని భావించిన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. కొండవీటి వాగుకు వరద నీరు వచ్చినప్పుడు ఈ రిజర్వాయర్‌ను నింపు తారు. అది కూడా నిండిపోయాక అదనపు ప్రవాహాన్ని నీరుకొండ రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడ కూడా నిండి పోయాక కృష్ణాయపాలెం- కురగల్లు మధ్య నిర్మించే మరో రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. అవి కూడా నిండి పోయాక అదనపు నీటిని కృష్ణా నది వైపు నకు వదిలేస్తారు. కృష్ణా నదిలో కూడా వరద ప్రభావం ఎక్కువగా ఉంటే ప్రకాశం బ్యారేజీ వద్ద నిర్మించిన ఎత్తిపోతల యంత్రాల ద్వారా కృష్ణా నదిలోకి తోడి పోస్తారు. ఇలా రాజధాని వరద నీటి (మిగతా 8వ పేజీలో)



రిజర్వాయర్‌లో జరుగుతున్న తొలి దశ ఫౌండేషన్ పనులు

జేజేఎం..వేమూరుకు రూ.9.72 కోట్లు

వేమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 18 గ్రామాలకు అత్యవసర మంచినీటి సమస్య పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.9,72,37,000 నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు తెలిపారు. వేమూరు మండలం చావలిలో అదనపు ట్యాంకు నిర్మాణానికి రూ.53.58లక్షలు, పెరవలిపాలెంలో ట్యాంక్ దెబ్బతినడంతో కొత్త ట్యాంకు నిర్మాణానికి రూ.99 లక్షలు, పెనుమర్రులో ఉప్పు నీటి సమస్య పరిష్కారం కోసం.. కొల్లూరు మండలం చినపులివర్రు గ్రామం నుంచి 4 కిలోమీటర్ల దూరం పైపులైన్ నిర్మాణానికి రూ.46.20 లక్షలు, కోడిపర్రు గ్రామానికి చావలి రోడ్డు మార్గంలో బోరు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు రూ.18 లక్షలు మంజూరు చేశారు. కొల్లూరు మండలం కిష్కింద పాలెంలో పైపులైను విస్తరణకు రూ.9.95 లక్షలు, పోతార్లంకలో పైపులైను విస్తరణకు రూ.5.94 లక్షలు మంజూరయ్యాయి. అమృతలూరు గ్రామంలో కొత్త ట్యాంకు నిర్మాణానికి రూ.51 లక్షలు, యలవర్రులో అదనపు బోరు ఏర్పాటుతో పాటు పైపులైను విస్తరణకు రూ.10 లక్షలు, గోపాయపాలెంలో పైపులైను ఏర్పాటుకు రూ.50 లక్షలు, ప్యాపర్రులో మైక్రోఫిల్టర్ ఏర్పాటుతో పాటు పైపులైను ఏర్పాటుకు రూ.58.3 లక్షలు, గోవాడలో ట్యాంకు నిర్మాణంతో పాటు పైపులైను ఏర్పాటుకు రూ.కోటి, ఇంటూరులో 120 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మాణం.. పైపులైను టాప్స్ ఏర్పాటుకు రూ. 1.77 కోట్లు మంజూరు చేశారు. భట్టిప్రోలు మండల కేంద్రంలో అదనపు పైపులైను టాప్స్ ఏర్పాటుకు రూ.70 లక్షలు, అద్దేపల్లిలో ట్యాంకు నిర్మాణానికి రూ.22.30 లక్షలు, కోనేటిపురంలో అదనపు ట్యాంకు నిర్మాణానికి రూ.39.70 లక్షలు మంజూరయ్యాయి. చుండూరు మండలం ఆలపాడులో పైపులైను టాప్స్ ఏర్పాటుకు రూ.47.50 లక్షలు, మండూరులో ట్యాంకు నిర్మాణానికి రూ.76.30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో అమృతలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో ట్యాంకు నిర్మాణం పనులు ప్రారంభించి నట్లు ఏఈలు వెల్లడించారు. మిగతా 17 గ్రామాల్లో పనులను త్వరితంగా ప్రారంభిస్తామన్నారు.



- పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి వేదికపై మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

నల్లబర్లీ కొనుగోలు చారిత్రాత్మకం

- మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి
- పంగులూరు, ఇంకొల్లులో పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పంగులూరు, ఇంకొల్లు జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని, రైతులను ఆదుకునే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మానవత్వం చాటారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరు మార్కెట్ యార్డ్ నందు మార్క్‌ఫెడ్ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతూ నల్లబర్లీ సాగును ప్రోత్సహించిన కంపెనీలు పంట కొనుగోలు సమయంలో ముఖం చాటేస్తే రాష్ట్ర ప్రభుత్వం వారి కష్టాలను గుర్తించి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న మామిడి, కోకో, పొగాకు పండించిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవడమే ఇందుకు నిదర్శనమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రూ.1637 కోట్లను రైతులకు బకాయి పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించి నిబద్ధత చాటుకొందన్నారు.

కొరిశపాడు, మార్టూరులో కొనుగోలు కేంద్రాలు

కొనుగోలు కేంద్రాలను మరిన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. కొరిశపాడు, మార్టూరులలో పొగాకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ చరిత్రలో నిలుస్తుందన్నారు.

కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రోజుకు 30 టన్నుల పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు పెంచనున్నట్లు తెలిపారు. అనంతరం యార్డ్ ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యార్డ్ చైర్మన్ పద్మావతి, మార్క్‌ఫెడ్ ప్రత్యేకాధికారి కె.కిషోర్, డీఎం కరుణశ్రీ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, యార్డ్ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆర్‌డీవో. చంద్రశేఖర నాయుడు, జిల్లా సహకార అధికారి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.



పొగాకు తేమ శాతాన్ని మంత్రులకు వివరిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్

ఇంకొల్లు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇంకొల్లులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్రవిద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేస్తోందన్నారు. సుమారు రూ.270 కోట్లు దీని కోసం కేటాయించారన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి డైనమిక్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు.



ఇంకొల్లులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి



గ్రావెల్ తవ్వకాలుతో కొండ దిగువ భాగం

కొండ చెరువుగా మారుతోంది!

ధర్మవరం కొండ చుట్టూ భారీ మట్టి తవ్వకాలు

అద్దంకి,జూన్30(ఆంధ్రజ్యోతి): గ్రావెల్ అడ్డగోలు తవ్వకాలతో ధర్మవరం సమీపంలోని కొండ దిగువభాగం చెరువులను తలపించేలా మారింది. విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం అద్దంకి ప్రాంతంలోని ధర్మవరం చెరువుతో పాటు పలు కొండల నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు. ధర్మవరం చెరువులో మట్టి తవ్వకంతో నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందని గ్రామస్థులను ఒప్పించి గ్రావెల్ తవ్వారు. అయితే ప్రస్తుతం ధర్మవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సమీపంలో అద్దంకి, పంగులూరు, మార్టూరు మండలాల సరిహద్దులో ఉన్న కొండపై వీరి కన్ను పడింది. గతంలో నీరు-చెట్టు పథకం ద్వారా కొండ చుట్టూ కందకాలు తవ్వగా, ప్రస్తుతం ఆ కందకాల స్థానంలో సుమారు 30 అడుగుల లోతుతో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దీంతో గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రాంతంలో నీటి ఊట కూడా వస్తోంది. గ్రావెల్ తరలింపునకు అనుమతులు తీసుకున్నా కొండ అడుగు భాగంలో లోతుగా చెరువులను తలపించేలా గోతులు తవ్వకూడదనే నిబంధన ఉందని రెవెన్యూ అధికారులు సైతం చెబుతున్నారు. నిత్యం వందల టిప్పర్ల మట్టి తరలిస్తుండటంతో కొండ ఆనవాళ్లు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. కొండ పైన పూర్తిగా శిథిలమైన అతిపురాతన నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఉంది. ఎంతో చరిత్ర ఉన్న కొండను గ్రావెల్ తవ్వకాలకు వినియోగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మరమ్మతులు చేపట్టేందుకు టెండర్లు పూర్తైన నేపథ్యంలో సమీపంలో 30 అడుగుల లోతులో గోతులు తవ్వితే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు ఇంకిపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండ వద్ద గ్రావెల్‌ను నేలమట్టం లో మాత్రమే తవ్వకాలు చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంపునకు ఆమోదం

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

మంగళగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంపునకు కేంద్రం ఆమోదం తెలిపిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మంగళగిరి 16వ నంబరు జాతీయ రహదారి వద్ద ఎంట్రీ ర్యాంపును ఎగ్జిట్ ర్యాంపుగా మార్చేందుకు ఆమోదం లభించిందని చెప్పారు. దీని ద్వారా ఎయిమ్స్‌ను చేరుకునేందుకు ఇప్పటి వరకు ఉన్న దూరం 4.66 కిలోమీటర్ల నుంచి 1.26 కిలోమీటర్లకు తగ్గనుందని వెల్లడించారు. జాతీయ రహదారిపై మూడు కీలక ప్రాంతాల్లో 13 బోర్డుల ఏర్పాటుకు కూడా అనుమతి వచ్చిందన్నారు. అత్యవసర వైద్యం, రోగులు, ప్రయాణికుల రవాణా, వైద్య సిబ్బంది రాకపోకలకు ఈ నిర్ణయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.

గ్రేడ్ -5 కార్యదర్శులకు కౌన్సెలింగ్



గ్రేడ్ -5 కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓలు నాగసాయి కుమార్, ప్రభాకర్‌రావు, నాగేశ్వర్ నాయక్

గుంటూరు సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శుల కు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు 154 మంది ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయి కుమార్ తెలిపారు. మరో 62 మంది రిక్వెస్ట్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికీ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. బాపట్ల, పల్నాడు డీపీఓ లు కె.ఎల్.ప్రభాకర్ రావు, నాగేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ వెలవెల

● తగ్గిన ప్రయాణికుల రద్దీ ● పడిపోయిన రోజు వారీ చార్జీల ఆదాయం



ప్రయాణికుల్లేక కళావిహీనంగా ఉన్న ఎన్టీఆర్ బస్టాండ్

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి రోజువారీ ప్రయాణికుల రద్దీ క్రమంగా తగ్గుతోంది. నిత్యం కోలాహలంగా ఉండే ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల్లేక వెలవెలబోతోంది. శుభ కార్యాలు పెద్దగా లేకపోవడం.. మరో వైపు విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. సాధారణంగా గుంటూరు-1, 2 డిపోలకు సంబంధించి బస్సులు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. తద్వారా ప్రయాణికులతో ఎన్టీఆర్ బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్రం గుంటూరు నుంచి రోజువారీగా వేలాది మంది గమ్య స్థానాలకు చేరుతుంటారు. కొన్ని రోజులుగా రోజువారీ ప్రయాణికుల సంఖ్య చాలా వరకు తగ్గుతూ వస్తోంది. కేవలం టిక్కెట్ల చార్జీల రూపంలోనే రెండు డిపోలకు దాదాపుగా నిత్యం రూ.38లక్షల నుంచి రూ.40 ల వరకు సమకూరుతుందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే తాజాగా ప్రయాణికుల రద్దీ తగ్గటంతో చార్జీల రూపంలో వచ్చే ఆదాయం కూడా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు తగ్గిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక వైపు పండుగులు, శుభకార్యాలు కూడా పెద్దగా లేకపోవడం, విద్యా సంస్థలు ప్రారంభమవడం కూడా ఒక కారణంగా విశ్లేషిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ తగ్గడంతో బస్టాండ్‌లో వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. రానున్నది శ్రావణ మాసంతో పాటు శుభకార్యాలు కూడా పెద్ద ఎత్తున జరుగనున్న నేపథ్యంలో మున్ముందు ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మైనింగ్‌లో పన్ను ఎగవేతను అరికట్టాలి : జేసీ



సమావేశంలో జేసీ సూరజ్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

నరసరావుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ అక్రమ రవాణా ద్వారా జరిగే పన్ను ఎగవేతను అరికట్టాలని జేసీ సూరజ్ ధనుంజయ్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జీఎస్టీ సమావేశంలో తీర్మానించారు. శాఖల మధ్య సమన్వయ బలోపేతం, పన్ను పరిపాలన మెరుగు, వసూళ్ల లక్ష్యాల మేర సమర్థంగా చేయాలని జేసీ స్పష్టం చేశారు. జీఎస్టీ నమోదు చేయని వ్యాపారాలను గుర్తించి పన్ను పరిధిని విస్తరించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో అధికారులు వారి శాఖల్లో టీడీఎస్ నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలి సూచించారు. టీడీఎస్ చెల్లించని కాంట్రాక్టర్లను తదుపరి టెండర్లలో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో గుంటూరు 2 జాయింట్ కమిషనర్ బి.గీతామాధురి, డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

కోనో కార్పస్‌ను కాపాడుకుందాం

● పర్యావరణ వేత్త ప్రొఫెసర్ బయ్యపు రెడ్డి



మాట్లాడుతున్న పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపు రెడ్డి

గుంటూరు కార్పొరేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కోనోకార్పస్ (దుబాయ్) మొక్కలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ఈ చెట్టు అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తుందని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి పేర్కొన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో కోనో కార్పస్ మొక్కలను రక్షించుకుందాం అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రపంచంలో 80 దేశాలకు పైగా విస్తరించిన కోనోకార్పస్ కార్బన్ డైయాక్సైడ్‌ను తీసుకుని అత్యధికంగా ఆక్సిజన్ అందిస్తూ వాయు కాలుష్యాన్ని, ధ్వని కాలుష్యాన్ని నివారించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ మొక్క ఎలాంటి నిర్వహణ వ్యయం లేకుండా వేగంగా పెరుగుతూ పచ్చదనాన్ని అందిస్తూ, పర్యావరణ హితంగా కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. కోనోకార్పస్ పుప్పొడి ద్వారా అలర్జీ సమస్యలు వస్తాయనే ప్రచారం అపోహలు తప్ప ఎక్కడ ఆధారాలు లేవన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. మాఫియా తమ దోపిడీకి అడ్డంగా ఉన్నాయని కోనో కార్పొస్‌పై అర్థ రహిత ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఏళ్ళ రత్తయ్య, జీవశాస్త్ర నిపుణులు జి.గోపాలకృష్ణ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, టి.ధనుంజయ రెడ్డి, కొరివి వినయ్ కుమార్, ఓరుగంటి నారాయణ రెడ్డి, అవధానుల హరి, అల్లాబక్షు, మానవత నేతలు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కోసం గత 35 ఏళ్లుగా తనతో పాటు కలసి తిరిగి.. పార్టీ అధికారంలోకి రావడానికి పని చేసిన ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం రామాపురం గ్రామానికి చెందిన ఆకూరి వెంకటరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. కర్మక్రియల రోజున మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సిమెంట్ యాజమాన్యం ఇచ్చిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతుడు ఆకూరి వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ మృతుడు ఆకూరి వెంకటరెడ్డి క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని పేర్కొన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు, వేముల వినోద్‌రెడ్డి, బద్రి, తంగెళ్ళ శ్రీను, పగడాల భాస్కరరావు, నెల్లూరి రామ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సవరించిన టిక్కెట్ చార్జీలు నేటి నుంచి అమలు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సబర్బన్, నాన్ సబర్బన్ రైళ్లలో మంగళవారం నుంచి రైల్వేబోర్డు సవరించిన టిక్కెట్ చార్జీలు అమలులోకి రానున్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే అమలులోకి వచ్చాయి. సబర్బన్(సింగిల్ జర్నీ ఫేర్)లో ఎలాంటి మార్పు చేయలేదు. సీజన్ టిక్కెట్స్(సబర్బన్, నాన్ సబర్బన్) రైళ్లలోనూ ఎలాంటి పెంపుదల చేయలేదు. ఆర్డినరీ నాన్-ఏసీ(నాన్-సబర్బన్) రైళ్లలో సెకండ్ క్లాస్ ఆర్డినరీ టిక్కెట్ చార్జీలలో 500 కిలోమీటర్ల వరకు ఎలాంటి పెంపుదల లేదు.

501 నుంచి 1,500 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి రూ.5, 2,500 కిలోమీటర్ వరకు రూ.10, 3 వేల కిలోమీటర్ దూరం అయితే రూ. 15 చార్జీ పెరిగింది. స్లీపర్ క్లాస్ ఆర్డినరీలో కిలోమీటర్‌కు అర పైసా, ఫస్టు క్లాస్ ఆర్డినరీలోనూ అర పైసా పెంపుదల చేసింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్(నాన్-ఏసీ) సెకండ్ క్లాస్, స్లీపర్, ఫస్టు క్లాస్‌లో కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున పెంచింది. ఏసీ తరగతుల్లో ఏసీ చైర్‌కార్, ఏసీ 3 టైర్/3ఎకానమి, ఏసీ టూటైర్, ఏసీ ఫస్టుక్లాస్/ఎగ్జిక్యూటివ్ క్లాస్/ ఈఏకు రూ.2 పైసలు చొప్పున పెంచింది.

గుంటూరు - విజయవాడ - తెనాలి, తెనాలి - రేపల్లె మధ్యన రాకపోకలు సాగించే ప్యాసింజర్ రైళ్ల టిక్కెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాస్‌కు కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున పెంచడం వల్ల సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లలో చార్జీ రూ. 5 వరకు పెరగొచ్చు. అదే ఏసీ తరగతులు అయితే రూ.10 వరకు పెరిగే అవకాశం ఉంది. చెన్నై, తిరుపతి, విశాఖపట్టణం వెళ్లే రైళ్లకు కూడా ఇంతే మొత్తంలో పెరగొచ్చు. తిరువనంతపురం, హౌరా, భువనేశ్వర్, ఎల్‌టీటీ, నాగర్‌సోల్, పూణే, పూరీ, యశ్వంత్‌పూర్ వెళ్లే రైళ్లలో పెరుగుదల ఇంకాస్త పెరిగే అవకాశం ఉంది.

జీడీసీసీ బ్యాంకు సీఈఓగా అజయ్ కిషోర్



గుంటూరు సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (జీడీ సీసీ) సీఈఓ నియామ కంపై ఏర్పడిన ప్రతిష్టంభనకు ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. జీడీసీసీ బ్యాంకు కొత్త సీఈఓగా సీహెచ్ అజయ్ కిషోర్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీఈఓకు సహకార శాఖ రాష్ట్ర ఉద్యోగుల సంఘం నేత మొవ్వా వెంకటేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శికి జైలు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో నిందితుడైన చీకటీగలపాలెం గ్రామ కార్యదర్శి కనుగంటి మహేంద్రకు కోర్టు జైలు శిక్ష విధించింది. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. గుంటూరు నగరంలోని చైతన్యపురి కాలనీలో నివాసం ఉంటున్న.. ప్రత్తిపాడు మండల పరిధిలోని పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి నాగిరెడ్డి తన చిన్నమ్మ మరణానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం కోసం.. ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండ మండలం చీకటీగలపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీకి 2010లో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ సర్టిఫికెట్ ఇవ్వడానికి .. అప్పటి గ్రామ ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న కనుగంటి మహేంద్ర రూ.8లక్షలు లంచంగా సదరు అన్నపురెడ్డి నాగిరెడ్డిని డిమాండు చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. సదరు ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ బాధితుని నుంచి 2010 జూలై 12న లంచం డబ్బులను తీసుకొంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేశారు. విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో అతనిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. తదనంతరం సదరు కోర్టు కేసు విచారణ అనంతరం అప్పటి సెక్రటరీ కనుగంటి మహేంద్రకు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానాగా విధిస్తూ సోమవారం కోర్టు తీర్పునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరుగుతుంటే.. దానిని గురించి ఎవరైనా సంబంధిత జిల్లా ఏసీబీ అధికారులకు కాని లేదా ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 1064కు గాని లేదా మొబైల్ నంబరుకు 94404 40057 కు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

సుపరిపాలన తొలి అడుగును విజయవంతం చేద్దాం

● రెవెన్యూశాఖామంత్రి అనగాని

రేపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సుపరిపాలన తొలి అడుగును సమష్టికృషితో విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మంత్రి మాట్లాడారు. జూలై 2 నుంచి నిర్వహించనున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి చేసిన అభివృద్ధి వివరించాలని సూచించారు. ప్రజలు ఇంకా ఏమి ఆశిస్తున్నారో.. తెలుసుకుని పార్టీ అధినాయకత్వానికి తెలియజేయాలన్నారు. ఏడాది కాలంలోనే పింఛన్ పంపు, అన్న క్యాంటిన్‌లు, మత్స్యకార భరోసా, తల్లికి వందనంతో పాటు ప్రతి గ్రామంలో రహదారులు అభివృద్ధి వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు ని వెళ్లాలని సూచించారు. జూలైలో అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమం అమలు చేయబోతున్నట్లు తెలిపారు. గడిచిన 365 రోజుల్లో 365 మంచి పనులు చేసినట్లు ప్రజలకు తెలపాలన్నారు. ఈ సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టుకమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, నియోజకవర్గ పరిశీలకులు ఎం.రామస్వామి, కనగాల మధుసూదన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా ఆకాంక్షలు నెరవేరుస్తున్న ప్రభుత్వం

● శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి



రెంటచింతల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తూ.. ఎన్నికల హామీలన్నింటిని నెరవేరుస్తోందని శిల్పారామం చైర్‌పర్సన్ చేత్రెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెంటచింతలలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లికి వందనం పథకం అమలు చేయడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవతో రెంటచింతలలోని సాగు నీటి కాల్వల మరమ్మతులకు రూ.1.33 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జూలై 2 నుంచి ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కాబోతుందని ప్రతి ఒక్కరూ హాజరుకావాలని టీడీపీ శ్రేణులను కోరారు. మాజీ ఎంపీటీసీ శివయ్య, మాజీ సర్పంచ్ సుంకయ్య, రాయపరెడ్డి, కొత్త అంజి, కొత్త గోపాలరావు, వై.అప్పయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు



పట్టుబడ్డ ట్రాన్స్‌ఫార్మర్ల మెటీరియల్, నిందితులతో పోలీసులు

మాచర్లటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలకొట్టి రాగి వైరు దొంగిలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,19,620 స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఈ ముఠాను వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి తన సిబ్బందితో కలిసి శిరిగిరిపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. వెల్దుర్తిలో 13, మాచర్లటౌన్ 1, మాచర్ల రూరల్ 7, దుర్గి 17, కారంపూడి 4, నాగార్జున సాగర్ 15, ప్రకాశం జిల్లా పుల్లల చెరువు 7, యర్రగొండపాలెంలో 3 ట్రాన్స్‌ఫార్మర్లు ముఠా దొంగిలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి 305 కిలోల రాగి వైరు, 200 మీటర్ల కేబుల్ వైరు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మొగిలి నాగరాజు, గద్దం బయన్న, దార్ల భవాని, దేవర అంజమ్మ నిందితులని వెల్లడించారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సమందర్‌వలి, రూరల్ సీఐ నఫీజ్ బాషా, అర్బన్ సీఐ పచ్చిపాల్ల ప్రభాకరరావు, విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కొడుకు అరెస్టు

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు వివరాల ప్రకారం.. చెంబేటి శ్రీనివాస్ (45) తెలంగాణలోని సిద్దిపేటలో బేల్దారి పనులు చేసుకుంటూ నాలు గు నెలలకోసారి మురికిపూడిలోని ఇంటికి వస్తుండేవారు. ఆయన సోరియాసిస్, తలలో రక్తం గడ్డకట్టడం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. కుటుంబ వివాదాల కారణంగా ఈ నెల 7న మద్యం మత్తులో ఉన్న తండ్రిని కుమారుడు చెంబేటి రామకృష్ణ (22).. మద్యం సేవించి వెళ్లి దారుణంగా కొట్టాడు. దెబ్బలకు తండ్రి శ్రీనివాస్ మృతి చెందాడు. నిందితుడు రామకృష్ణను కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు.

విద్యుఘాతంతో రైతు మృతి

దాచేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు గ్రామంలో మేడా సైదారావు(25) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సోమవారం పంట పొలంలో విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	96, 104, 115
చికెన్ విత్ స్కిన్(కిలో)	184.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	194.00

38,592 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 41,119 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,592 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,935 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నెంబరు. 5	10000	13400
273	---	---
341	10000	13300
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13400
షార్క్-1	---	---
బ్యాడిగి	10000	13000
సింజెంటా బ్యాడిగి	---	---
దేవనూరు డీలక్స్	---	---

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9700	13000
నెంబరు. 5	10000	13300
273	---	---
341	10000	13200
4884	10000	12500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500
బ్యాడిగి	10000	13000
దేవనూరు డీలక్స్	10000	12500
తాలుకాయలు	4500	7000



పీజీఆర్ఎస్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

విచారించి అర్జీలు పరిష్కరిస్తాం : ఎస్పీ

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ పెట్టుకున్న ప్రతి ఒక్కరి సమస్యలు విచారించి చట్టపరిధిలో పరిష్కరిస్తామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని వివిధప్రాంతాలు నుంచి 49 మంది వచ్చి అర్జీలు అందజేశారు. అర్జీలు స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీల విషయమై సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులతో మాట్లాడి విచారించి వేగవంతంగా పరిష్కరించాలని చెప్పారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూవివాదం, ఆర్థికలావాదేవీలు, మోసాలకు సంబంధించి అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాల్గవ వార్డులో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ పాల్గొని పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కమిటీ ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పి.రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



భక్తులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

మంటలు పూర్తిగా అదుపులోకి తీసుకురావాలి : కమిషనర్

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులో గల డంపింగ్ యార్డులో ఆదివారం రాత్రి ఎగసి పడిన అగ్నికీలలు ఆర్పేందుకు మున్సిపల్ అధికారులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని సోమవారం సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పరిశీలించారు. మంటలు అదుపులోకి వస్తూనే మరొకచోట రగులుతూ ఉండటంతో ఇంజన్‌లు తీసుకొచ్చి డ్రైనేజీలో నీటిని తోడి అదుపు చేస్తున్నారు. అవసరమైతే మరొక ఇంజన్ ఏర్పాటు చేసి మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రలో అవినీతి జరిగిందంటూ పెద్ద ఎత్తున వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు సోమవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. క్రీడాపరికరాల కొనుగోలులో అవకతవకలు, క్రీడా కిట్‌ల పంపిణీ తదితర అంశాలు గురించి కమిషనర్ జి.రఘునాథరెడ్డిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సైదులు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల పట్టణానికి సంబంధించి క్రీడాకిట్‌లు మాత్రమే వచ్చాయని అవి నేరుగా క్రీడాకారులకు పంపించినట్లు కమిషనర్ తెలిపారు. అయితే కిట్‌లు ఎవరెవరికి ఇచ్చారో తెలిసే విధంగా జాబితా సేకరించి ఇవ్వాలని సీఐ కోరారు. సుమారు గంట సేపు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. క్రీడలలో ఎన్ని జట్లు పాల్గొన్నాయి, ఎంతమంది ఆడారనే విషయంపై ఆరా తీశారు. అయితే జిల్లాకు కేవలం కిట్‌లు మాత్రమే వచ్చాయని డబ్బులు కేటాయించలేదని తెలుసుకున్నారు. మరొకసారి విచారణకు రానున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కమిషనర్‌కు తెలిపారు.

వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కావడి సేవా మహోత్సవం

బాపట్ల,జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కావడి సేవా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సూర్యలంక రోడ్డులోని కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో శ్రీలలిత త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కావడి సేవా మహోత్సవం పురవీధులలో భక్తుల నడుమ నేత్రపర్వంగా జరిగింది. నెమలికంటి హనుమంతరావు సారథ్యంలో పండితులు ముత్తేవి శ్రీనివాస శశికాంత్ యాజ్ఞిక పర్యవేక్షణలో మేడూరి వెంకటఅప్పలచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, గోపాలచార్యులు, కొల్లిపర వెంకట శివవరప్రసాద్, శ్రీనివాసుల విఖనసమూర్తి, గూడా సాయివెంకట్, సురేష్‌శర్మల సహకారంతో స్వామి వారికి అభిషేకం, కావడి సేవా, పుష్పయాగం, సర్పసూక్త హోమం వైభవంగా జరిగాయి. అనంతరం 2 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.



కావడి సేవతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

సముద్ర దొంగలపై చర్యలు తీసుకోవాలి

● మత్స్యకార సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సమస్య పరిష్కారం కోసం న్యాయమైన పోరాటం చేస్తున్న తమపై దుష్ప్రచారం చేస్తున్న సముద్ర దొంగలపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బాపట్ల మండలం అడవి గ్రామపంచాయతీ పరిధిలో ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ కాల్వ సముద్రంలో కలిసే ప్రాంతాన్ని పూడ్చి స్వాధీనం చేసుకోవాలని చూస్తున్న భూబకాసురులపై చర్యలు తీసుకోకపోవటంతో వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా మత్స్యకారులపై రాజకీయరంగు పులిమి అసత్య ఆరోపణలు చేయటం దారుణమని జేఏసీ ఛైర్మన్ సైకం రాజశేఖర్ అన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌సీ మెంబరు ఎరిపిల్లి రమణ, పిక్కి శామ్యూల్, నాగేశ్వరరావు, సున్నపు పోలయ్య, జీవరాజు, చిన శామ్యూల్, సత్యబాబు, బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్రనాయకులు మేకల ప్రసాద్, సీపీఐ నాయకులు తన్నీరు సింగరకొండ, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

కొండలు స్వామికి ఘన సన్మానం

కర్లపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో ఫార్మల్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్‌లో యాజలి రైతులు గాయకుడు కొండలు స్వామిని డైరెక్టర్ ఇక్కుర్తి లక్ష్మీ నరసింహ, రాజేశ్వరి దంపతులు మెమెంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింహాద్రి శివయ్య, కాటూరి నాగరాజు, రోశయ్య, కె.బాలకృష్ణ, సోములు సింహాద్రి, వెంకన్న, శివయ్య, వెంకటపతి రాజు, భాస్కర్‌రాజు, శ్రీనివాసరావు, మల్లారెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు మహాలక్ష్మీ పురస్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మండల పరిధిలోని సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురికి అమెరికాలో నివాసం ఉంటున్న తాడేపల్లి సుబ్రహ్మణ్యశర్మ మాతృమూర్తి పేరు మీద తాడేపల్లి మహాలక్ష్మి పేరుతో పురస్కారాలు అందజేశారు. ఈ పురస్కారం, నగదును పాలకవర్గ అధ్యక్షులు చేతుల మీదుగా అందించినట్లు హెచ్ఎం కూచిబోట్ల శ్రీనివాసశర్మ తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దీవి దుర్గాభవాని, జంగం అరుణారాణి, బొర్రా రాజేశ్వరి, జంపాని నాగకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్
● పోర్టల్‌లో 50 అర్జీలు చూడని అధికారులు
● నోటీసులు జారీ చేయాలని డీఆర్వో ఆదేశం



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తదితరులు

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందజేసే వారి సమస్యలు పరిష్కరించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న డీఆర్వో సంబంధితాధికారులకు వాటి విషయమై పలుసూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పోర్టల్‌లో 50 అర్జీలను ఇంతవరకు సంబంధితాధికారులు చూసి ఉండలేదని అసహనం వ్యక్తం చేశారు. సంబంధితశాఖాధికారులు వారికి నోటీసులు జారీ చేయాలని చెప్పారు. 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల వివరాలు మేరకు జిల్లాలో 3,371 మంది 5 సంవత్సరాలు నిండిన పిల్లలు ఉన్నారని వారికి సంబంధించి తల్లిదండ్రుల పేర్లు, ఫోన్‌నెంబర్‌లను సేకరించినట్లు తెలిపారు. ఐసీడీఎస్, ఎస్టీ, ఎస్సీ, బీసీ, రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు సమన్వయంతో పని చేస్తూ పిల్లలందరిని పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారవేదికను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీవో

రేపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిష్కారవేదికకు పది అర్జీలు అందాయని తెలిపారు. పట్టణానికి చెందిన 22, 23వ వార్డులోని ప్రజలు పందులు గుంపులుగా తిరుగుతున్నాయని వాటినుంచి సంరక్షించాలని కోరారు. పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీమోహన్‌రావు అంకమ్మచెట్టు దగ్గర ట్రాఫిక్‌సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలు విచారించి పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

అధికారులు ఉద్యోగ విరమణ చేయటం బాధాకరం

● కలెక్టర్ జె.వెంకటమురళి



ఉద్యోగ విరమణ చేసిన తహసీల్దార్‌లను సన్మానిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బాధ్యతతో పని చేసి ముగ్గురు తహసీల్దార్‌లు ఒకేరోజు ఉద్యోగవిరమణ పొందటం చాలా బాధాకరమని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రెవెన్యూశాఖలో నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తూ ఉద్యోగవిరమణ పొందిన ముగ్గురు తహసీల్దార్‌లకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం సాయంత్రం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పి.సీతారత్నం, ఎస్.వెంకటరత్నం, సుందరమ్మలు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందారన్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, ఉపకలెక్టర్ లవన్న, పరిపాలనాధికారి మల్లిఖార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ ఉద్యోగవిరమణ చేసిన యర్రంశెట్టి సింహాచలం, పెండెల వెంకటేశ్వర్లు, పొట్నూరి పైడమ్మలకు వీడ్కోలు సభ నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ పి.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కమిషనర్ జి.రఘునాథరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వారి సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ, ఎం.ఉదయ్‌గోపి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖకు అందించిన సేవలు చిరస్మరణీయం : ఎస్పీ

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంపాటు పోలీసుశాఖకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉద్యోగవిరమణ పొందిన నలుగురు సిబ్బందికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ దొరపల్లి శామ్యూల్, ఏఆర్ ఎస్ఐ గంగవరపు విల్సన్ ఇస్సాక్, ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, హోమ్‌గార్డు గుద్దంటి జానకి రామయ్యలను ఎస్పీతో పాటు సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ పి.విజయసారథి, వెల్ఫేర్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎంటీఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన రామకోటయ్య

బాపట్లరూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధత, అంకితభావంతో కష్టపని చేసిన వ్యక్తి చింతంనేని రామకోటయ్య అని బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి అన్నారు. గత 27 సంవత్సరాలుగా బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో నాన్ టీచింగ్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న చింతంనేని రామకోటయ్య సోమవారం పదవీ విరమణ పొందారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది దుశ్శాలువాలతో, ఘనంగా సత్కరించారు.

గ్రామాల అభివృద్ధికి కార్యదర్శి ఉమాదేవి కృషి

తెనాలి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పని చేసిన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ లక్ష్యాలు సాధించేందుకు కార్యదర్శి తుమ్మల ఉమాదేవి విశేష కృషి చేశారని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. రూరల్ మండలం సోమసుందరపాలెం కార్యదర్శిగా పని చేస్తున్న ఆమె పదవీ విరమణ సభను సోమవారం గౌతమ్ గ్రాండ్‌లో నిర్వహించారు. ఉమాదేవి - మధుసూదనరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్యదర్శి విధులు నిర్వహించి ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. పలువురు కార్యదర్శులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలికి సన్మానం

వేమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పని చేసిన ఎ.కన్యకాపరమేశ్వరి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో వీడ్కోలు సభా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల బృందం సన్మాన పత్రం, మెమోంటో, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బదరీ నారాయణ ఏఎంసీ ఛైర్మన్ విజయబాబు, ఉపాధ్యాయులు నరసింహారావు, పార్థసారథి, భాగ్యమ్మ, శివయ్య, ప్రకాష్, మేస్సిరాణి, రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సమాజంలో ఎనలేని గుర్తింపు

పిట్టలవానిపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన ధూళిపాళ్ల నాగ మంజులాదేవి సోమవారం ఉద్యోగవిరమణ సభలో మండల రిటైర్డ్ విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. మంజులాదేవి, రమణమూర్తి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎశైలజ, మంతెనవారిపాలెం గ్రామ సర్పంచ్ లక్ష్మంరాజు ఆదిలక్ష్మీ వెంకటపతిరాజు, వివిధ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌కు మౌలిక వసతులు కల్పించాలి

రేపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 18వ వార్డు ఎన్టీఆర్ నగర్‌కు తాగునీరు, వీధి లైట్ల ఏర్పాటులో మున్సిపల్ అధికారులు విఫలం చెందారని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ కె.సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందించారు.

నేడు చుండూరు మండలంలో పర్యటించనున్న ఎమ్మెల్యే

చుండూరు (వేమూరు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండలం మున్నంగివారిపాలెంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొని దివ్యాంగులు, వృద్ధులకు పంపిణీ చేసిన అనంతరం ఉపాధి హామీ నిధుల ద్వారా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రజా రవాణాశాఖాధికారిగా సామ్రాజ్యం



సామ్రాజ్యంకు మొక్కనందజేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణాశాఖాధికారిగా డి.సామ్రాజ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ నుంచి బదిలీపై బాపట్లకు వచ్చారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. డిపోను అభివృద్ధి చేసి ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఉన్మత్త వారాహిదేవిగా శ్రీ బగళాముఖి



శ్రీ ఉన్మత్త వారాహిదేవిగా బగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రీవారాహి అమ్మవారి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఐదవ రోజు సోమవారం శ్రీ బగళాముఖి అమ్మవారిని శ్రీ ఉన్మత్త వారాహిదేవిగా అలంకరణగావించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

బాపట్ల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు

బాపట్ల రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం, బాపట్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.ఝాన్సీలక్ష్మీ, కోశాధికారిగా పి.విజయసారధి, ఉపాధ్యక్షులుగా ఎం.మాణిక్యమ్మ, షేక్ కరీముల్లాషాఖాదరి, కె.బాబురావు, సహాయ కార్యదర్శులుగా జె.పవన్‌కుమార్, బి.మరియమ్మ, ఎస్.కరీమ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ రవికృష్ణ, ఎం.చంద్ర, జి.శ్రీనివాసరావు, ఎస్.జ్యోతి, గౌరవాధ్యక్షులుగా జె.మరియమ్మ ఎన్నికైనట్లు ఎన్నిక ప్రక్రియ సీనియర్ పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తెలిపారు.

భవితా సెంటర్‌ను పరిశీలించిన అధికారులు

కర్లపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని ఇందిరానగర్‌లో గల భవిత స్కూల్‌ను ఐఈ కో ఆర్డినేటర్ మట్టు జోత్స్న, మండల విద్యాశాఖాధికారి-2 విజయశ్రీ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు చిన్నారుల ప్రతిభను పరిశీలించి వారికి బోధించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు నరాలశెట్టి లక్ష్మీ ప్రసన్న, చెన్నుబోయిన చందన, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.శైలజ, భవానీ, ప్రసాద్ పాల్గొన్నారు.

మలేరియా వ్యాధి నివారణకు చర్యలు

బాపట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ జూగుంట రాంబాబు తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రాంబాబు మలేరియా వ్యాధికి గల కారణాలు వివరించారు. అనంతరం నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీలార్వా వేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితులకు జరిమానా

వేమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదం కేసులో కారకులైన నిందితులకు కోర్టు జరిమానా విధించింది. కొల్లూరు గ్రామానికి చెందిన రాధాకుమారి తెనాలి నుంచి వస్తుండగా వేమూరు ప్రభుత్వ వైద్యశాల వద్ద తెనాలి వెళుతున్న గాలి విజయ్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. మద్యం సేవించి ఉన్న అతను వాహనం సక్రమంగా నడపకపోవడంతో ప్రమాదం జరిగింది. కింద పడిన రాధాకుమారి తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రిలో చేరింది. 2021 జనవరిలో జరిగిన ఈ ప్రమాదాన్ని ఏఎస్ఐ కరీముల్లా కేసు నమోదు చేశారు. తెనాలి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ అనంతరం నిందితులు విజయ్‌కు రూ.7 వేల జరిమానా, వాహనం యజమాని దీపారాణికి రూ.7 వేలు జరిమానా విధిస్తూ జడ్జి రాజశేఖర్ సోమవారం తీర్పు చెప్పారు. పి.సునీల్‌కుమార్ పీపీగా వ్యవహరించారు.



మసీదు శంకుస్థాపనలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలిగితే అల్లా ఆశీస్సులతో ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని 1వ వార్డులో నూతన మసీదు ఏర్పాటుకై ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి శంకుస్థాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు ఏర్పాటు చేస్తున్న పెద్దలకు అభినందనలు తెలిపారు. తమవంతు సహాయం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు మొహిద్దీన్, షేక్ జమీర్, షేక్‌గౌస్, ఖాన్, ఆరేఫా, ఆరీఫుల్లా, తయ్యబ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షులు ఏకగ్రీవం

● పార్టీని మరింత బలోపేతం చేయాలి : అనగాని



రామాంజనేయులు రామకృష్ణ సుబ్బారావు ఏడుకొండలు వెంకటేశ్వరరావు

రేపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, రేపల్లెటౌన్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేపల్లె రూరల్ మండలం అధ్యక్షుడిగా రేపల్లె రామాంజనేయులు, నగరం అధ్యక్షుడిగా చింతల సుబ్బారావు, చెరుకుపల్లి అధ్యక్షుడిగా తాతా ఏడుకొండలు, నిజాంపట్నం మండల అధ్యక్షుడిగా దండుప్రోలు వెంకటేశ్వరరావు, రేపల్లెటౌన్ అధ్యక్షుడిగా మేకా రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మేకా వెంకటశివరామకృష్ణ, నర్రా సుబ్బయ్య, విచారపు వీరయ్య, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జీవీ నాగేశ్వరరావు, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, మండవతాతాజీ, గోగినేని వసుధ, జయప్రద, పొన్నూరి గౌరీరామకుమారి, నాగశ్రీ పాల్గొన్నారు.

సమష్టి కృషితో పురపాలకసంఘ అభివృద్ధి

● మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగా



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ మంగా

రేపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితో పురపాలక సంఘాన్ని అభివృద్ధి చేయనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పది అంశాలను కౌన్సిలర్స్‌ముందు ఉంచగా వాటన్నింటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రెయిన్‌లు పూడికతీత పనులు చేస్తున్నామని, మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి అంటువ్యాధులు విజృంభించకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, వైస్ ఛైర్మన్ టీకేవీ గుప్తా, జీ.ప్రశాంత్, కౌన్సిలర్స్, కో ఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నగరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించటం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోగలరని నగరం ఎస్ఐ బండ్ల భార్గవ్ అన్నారు. మండల కేంద్రమైన నగరంలోని బాలయేసు విద్యార్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నవయసు నుంచే బాలికలు ఎలా మెలగాలి, ఎదుటివారి ప్రవర్తనను ఎలా గుర్తించాలి, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ వంటి అంశాలపై ఆయన వివరించారు. అనంతరం శక్తియాప్‌ను ఏవిధంగా వినియోగించాలి, దాని ఉపయోగాలు, దీన్ని ఉపయోగించటం ద్వారా ప్రమాదాల నుంచి ఎలా బయటపడవచ్చు అనే అంశాలపై బాలికలతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో బాలయేసు విద్యార్థినీ, విద్యార్థులు, నగరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వశాంతి హైస్కూల్‌లో దంత వైద్య శిబిరం

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో దంత వైద్య శిబిరం నిర్వహించారు. సిబార్ దంత వైద్యశాల తక్కెళ్లపాడుకు చెందిన 20 మంది వైద్యులు సోమవారం 1600 మంది విద్యార్థులకు దంత వైద్య శిబిరంలో పరీక్షలు చేశారు. కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారధి, డాక్టర్ టి.దేవకి, డాక్టర్ సృజన, వారి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి

చెరుకుపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన చిలకల సుబ్బారావు(70) పొలంలో దుక్కిదున్ని వస్తుండగా ట్రాక్టర్ తిరగబడటంతో మృతి చెందాడు. ఆయనకు ఒక కుమార్తె ఉన్నారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రోగుల కృతజ్ఞతే సంతృప్తి



ఏరియా వైద్యశాలలో గర్భిణిని పరీక్షిస్తున్న గైనకాలజిస్టు బీ అరుణ

- ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవం డాక్టర్
- రోగికి, వైద్యులకు ప్రత్యేకమైన అనుబంధం
- వైద్య వృత్తిపై మక్కువతో వైద్యుల సేవలు..
- నేడు వరల్డ్ డాక్టర్స్ డే..

సత్తెనపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన గమ్యంలో ఎన్ని రంగాలను ఎంచుకున్నా.. అన్నింటిలోకి భిన్నమైనది వైద్య వృత్తి. ఇదొక బాధ్యత. ధనం, పేరుప్రఖ్యాతులు కాదు.. తనను నమ్మి వచ్చిన రోగి ఆరోగ్యం మెరుగుపరిచి, ప్రాణం నిలబెట్టిన రోజు వారి కళ్లలో కనిపించే నిజమైన కృతజ్ఞతా భావం వైద్యులకు నిజమైన సంతృప్తిని స్తాయి. ప్రస్తుతం ధనమే పరమావధిగా అన్ని రంగాలు కొన్ని కళంకాలను అద్దుకుంటున్నా.. వైద్య వృత్తిని దైవ సమానంగానే భావిస్తారు. వైద్యో నారాయణ హరి అని ప్రాచీన సంస్కృత అనుబంధం. వైద్యులు అంటే ప్రజలకు ఒక నమ్మకం. విశ్వాసం. ప్రాణాలు పోసే దేవుడు. వైద్యుడు, రోగి మధ్య ఉన్న బలమైన బంధం ఉంటుంది. వైద్యుల సేవలను గుర్తించి, గౌరవించుకునేందుకు.. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా జూలై 1న డాక్టర్స్ డేని జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్ రెండవ ముఖ్యమంత్రి డాక్టర్ బిదాన్ సుందర్‌రాయ్ జ్ఞాపకార్థం మనం వైద్యుల దినోత్సవం నిర్వహించుకుంటాం.

వైద్యులంటే ఒక నమ్మకం

తమ సొంత కుటుంబ సభ్యులకు సైతం వెల్లడించని రహస్య సమాచారాన్ని వైద్యులకు మాత్ర మే రోగులు చెపుతారు. తమ శరీరాన్ని పరీక్షించేం దుకు నిరభ్యంతరంగా అంగీకరిస్తారు. ఈ స్థాయి లో నమ్మకం, విశ్వాసాన్ని పొందటమనేది మరియే ఇతర వృత్తిలో ఉండదు. ప్రజల నుంచి ఇంతగా విశ్వాసాన్ని పొందుతున్న వైద్యులు.. నమ్మకాన్ని కాపాడు కోవాలి. తమ విధుల పట్ల అంకిత భావాన్ని ప్రదర్శించాలి. కొన్ని సంవత్సరాలుగా పలు కారణాల వల్ల వైద్యులు, ఇటువంటి అద్వితీయ అనుబంధాన్ని బలోపేతం చేసుకొనేందుకు వైద్యుల దినోత్సవం కన్నా మంచి తరుణం లేదు. ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్లు ఆంధ్రజ్యోతికి తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

తండ్రి కోరిక మేరకు..



తన తండ్రి జాన్ సైమన్ కోరిక మేరకు డాక్టర్‌ను అయ్యాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచి వైద్య రంగం అంటే చాలా మక్కువ ఏర్పడింది. గైనకాలజిస్టుగా.. 25 ఏళ్ల నుంచి రోగులకు సేవలు అందించడం ఎంతో సంతో షంగా ఉంది. ముఖ్యంగా గర్భిణులకు సేవలు అందించడం చాలా ఆనందంగా ఉంది.

-డాక్టర్ బి.అరుణ, గైనకాలజిస్టు

తల్లిదండ్రుల కృతజ్ఞతలతో సంతృప్తి



నా తండ్రి మోహన్‌రావు వైద్య ఆరోగ్య శాఖలో పని చేసేవారు. చిన్నప్పటి నుంచి డాక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ గురించి మాకు తెలియజేసేవారు. తండ్రి ప్రోత్సాహంతో ఎంబీబీఎస్ పూర్తి చేసి.. చిన్న పిల్లల డాక్టర్‌ను అయ్యాను. పిల్లలకు వైద్య సేవలు అందించినప్పుడు వారి తల్లి దండ్రులు చూపే కృతజ్ఞతలు సంతోషంగా ఉంటాయి.

-డాక్టర్ లక్ష్మణరావు, చిన్న పిల్లల డాక్టర్

17 ఏళ్లుగా సేవలు



తండ్రి వాసుదేవరాజు రైతు. చిన్నప్పటి నుంచి నేను డాక్టర్ కావాలని చెబుతుండేవారు. ప్రపంచంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి... వైద్య వృత్తి అని చెప్పే వారు. ఆయన కోరిక మేరకు ఎంబీబీఎస్ పూర్తి చేసి ఎండీ జనరల్ పూర్తి చేశాను. 17 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో రోగులకు సేవలు అందించడం సంతోషంగా ఉంది.

- డాక్టర్ గిరిరాజు, ఎండీ జనరల్

1.70 లక్షల కుటుంబాలకు.. ముందస్తు రేషన్

- ప్రభుత్వం కల్పించిన అవకాశం సద్వినియోగం
- క్యూలైన్ కష్టాలు తప్పాయని వృద్ధులు, దివ్యాంగుల సంతోషం
- ఈ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను తీసుకోవడంలో వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంచి ఫలితాన్ని ఇచ్చింది. జూలై నెలకు సంబంధించిన రేషన్ సరుకులను జూన్ 25 నుంచే తీసుకొనే వెసులుబాటుని ప్రభుత్వం కల్పించింది. ఐదు రోజులుగా మూడు జిల్లాల్లో చాలా మంది దీనిని సద్వినియోగం చేసుకున్నారు. సగటున ఒక్కో జిల్లాలో 55 వేల మందికి పైగా సరుకులను తీసుకెళ్లారు. దీంతో మంగళవారం అందరికి ప్రారంభం కానున్న రేషన్ సరుకుల పంపిణీలో వృద్ధులు, దివ్యాంగులకు కష్టాలు తప్పాయి. ఈ విధానం శాశ్వతంగా కొనసాగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గత నెల నుంచి రేషన్ పంపిణీ విధానాన్ని ప్రభుత్వం మార్చింది. అంతకుముందు వరకు వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థ ద్వారా సరుకుల పంపిణీ జరిగింది. అయితే ఈ విధానం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడింది. దీనికి తోడు ఎండీయూ ఆపరేటర్లు నేరుగా లబ్ధిదారులకు సరుకులకు బదులు నగదు ఇచ్చి వాటిని మాఫియాకి చేరుస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. తిరిగి రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేపట్టింది. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ సరుకులు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే డీలర్లకు వీలుకాక పోవడం, కొందరు ఎండీయూ ఆపరేటర్ల లాగానే.. ఈ-పోస్ యంత్రం తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకొని సరుకులకు బదులు నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఈ నెల నుంచి దివ్యాంగులు, వృద్ధులకు ఐదు రోజుల ముందుగానే సరుకులు పంపిణీ చేసేలా పీడీఎస్ సిస్టంలో ప్రభుత్వం మార్పులు చేసింది. అందులో భాగంగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి కొన్ని రోజులు ముందుగానే సరుకులను డీలర్ల దుకాణాలకు చేర్చారు.

జూన్ 25 - 30 మధ్యన రేషన్ తీసుకొన్న వృద్ధులు, దివ్యాంగులు

జిల్లా పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం శాతం
పల్నాడు	79736	12.55
బాపట్ల	56311	11.81
గుంటూరు	44411	7.51

పల్నాడు జిల్లాలో అధికం..

ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని రాష్ట్రంలోనే ఎక్కువ సంఖ్యలో పల్నాడు జిల్లాలోని లబ్ధిదారులు వినియోగించుకొన్నారు. ఆ తర్వాత స్థానంలో బాపట్ల జిల్లా, 18వ స్థానంలో గుంటూరు జిల్లా ఉంది. షాపుల వద్దకు వెళ్లగలిగే స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు తమకు సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి నిమిషాల వ్యవధిలోనే సరుకులు తీసుకోగలిగారు. ఈ విధానం ఎంతో బావుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి క్యూలైన్లలో నిలుచోవాల్సిన అవసరం లేకుండా పోయిందంటున్నారు. కాగా ఇప్పటికే 10 శాతం పైగా సరుకులు తీసుకొన్నందున ఆ మేరకు మంగళవారం నుంచి లబ్ధిదారులందరికి ప్రారంభమయ్యే సరుకుల పంపిణీ సందర్భంగా కొంత మేరకు రద్దీ తగ్గుతుందన్న అభిప్రాయం డీలర్లు, పౌరసరఫరాల అధికారులు వ్యక్తం చేస్తున్నారు.



వరద నీటి నిర్వహణ.. పర్యాటక ఆకర్షణ

(5వ పేజీ తరువాయి)

నిర్వహణలో ఈ రిజర్వాయర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. కాగా శాఖమూరు రిజర్వాయర్‌ను కేవలం రిజర్వాయర్‌గానే కాకుండా పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ ప్రయత్నిస్తోంది. ఫ్లవర్ గార్డెన్, క్రాఫ్ట్ బజార్, అమ్యూజ్‌మెంట్ పార్కు, మ్యూజికల్ ఫౌంటేన్, లేజర్ షో ఏర్పాటు చేయడంతోపాటు, రిజర్వాయర్లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దాంతోపాటు వాకింగ్ ట్రాక్, యోగా, మెడిటేషన్ హాళ్లను కూడా ఏర్పాటు చేయాలని సీఆర్డీఏ నిర్ణయించింది.

● పూర్తయిన పూడిక తీత

50 ఎకరాల్లో నిర్మిస్తున్న శాఖమూరు రిజర్వాయర్ పూడిక తీత పనులు నూరుశాతం పూర్తయ్యాయి. వరద నీరు రిజర్వాయర్‌లోకి రాకుండా మట్టితో ఆనకట్టలు కట్టి అడ్డుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో స్వల్పంగా నీరు చేరింది. ఆ నీటిని మోటార్లతో తోడుతూ పనులు కొనసాగిస్తున్నారు. రిజర్వాయర్‌కు ఫస్ట్ లెవెల్ కాంక్రీట్ ఫౌండేషన్ పనులు దాదాపు తుది దశకు చేరాయి. తొలి దశ ఫౌండేషన్ పనుల్లో భాగంగా వాటర్ ప్రూఫ్ షీటు అమర్చి, దాని మీద గ్యాబిన్ మెస్ ఏర్పాటు చేసి దాంట్లో రాళ్లు నింపి ఫౌండేషన్ లేయర్‌ను రూపొందించారు. ఈ పనులు తుది దశలో ఉన్నాయి. ఈ వారంలో అది కూడా పూర్తవుతుందని నిర్మాణ సంస్థ చెబుతోం ది. కాగా పార్కు చుట్టూతా ఫెన్సింగ్ ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి.

ఆగంతకులకు రాచమార్గం

(5వ పేజీ తరువాయి)

ప్రదర్శిస్తున్నారు. తాజాగా ఆదివారం వేకువజామునకు ముందు పిడుగురాళ్ల, తుమ్మలచెరువు మధ్యన విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి జరిగిన ప్రయత్నంలో పోలీసులు జరిపిన కాల్పుల ఉదంతం.. రైల్వేలో భద్రతపై మళ్లీ అనుమానాలను రేకెత్తిస్తోంది.

ఈఎఫ్‌టీలో నిబంధనకు నీళ్లు..

బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి యువకులు పనుల కోసం ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. వీళ్లంతా ఎక్కువగా విశాఖ, ఫలక్‌నూమా, అమరావతి, ప్రశాంతి, సిల్చార్, ఎల్‌టీటీ, భావనగర్, నాగర్‌సోల్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణిస్తుంటారు. రిజర్వేషన్ చేసుకొంటే వాళ్ల వివరా లన్నీ రైల్వే డేటాలో రికార్డు అవుతాయి. దాంతో ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే జనరల్ టిక్కెట్ తీసుకొని స్లీపర్, ఏసీ త్రీటైర్‌లో ఎక్కేస్తుంటారు. బోగీల్లో ఖాళీలు లేకపోతే టీటీఈలు వీళ్లని తదుపరి రైల్వేస్టేషన్‌లో దింపేయాలి. ఒకవేళ ఖాళీలు ఉంటే ఈఎఫ్‌టీ రాసి అందులో ప్రయాణికుల పేర్లు, మొబైల్ నంబర్లు నమోదు చేయాలి. దాని వల్ల ఐడెంటిటీ అనేది పక్కాగా అందుబాటులో ఉంటుంది. అయితే టీటీఈలు ఈ పని చేయడం లేదు. బెర్తులు ఖాళీలు లేకపోయినా ఈఎఫ్‌టీ రాస్తున్నారు. అందులోనూ వివరాలు సరిగా నమోదు చేయడం లేదు. దీని వల్ల రైళ్లలో ఏదైనా నేరం జరిగినా నేరస్తులను గుర్తించడం కష్టతరమవుతోంది.

ఆగంతకులకు ఆహ్వానం..

ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు టిక్కెట్ కలెక్టర్లు కొన్ని ప్రధానమైన స్టేషన్లలో రైళ్ల బోగీల వద్ద బయట ఉండి ఈఎఫ్‌టీలు రాసి లోపలికి అనుమతి స్తున్నారు. పైన పేర్కొన్న ఏ రైలు గుంటూరు వచ్చినా స్లీపర్ క్లాస్‌లో కాలు పెట్టడా నికి కూడా ఖాళీ ఉండదు. చాలా మంది జనరల్ టిక్కెట్లతో.. ఫుట్ బోర్డు, టాయ్‌లెట్స్ వద్ద కూర్చుని ఉంటారు. గతంలో ఏసీ త్రీటైర్‌లో కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్ర యాణి కులనే అనుమతించే వారు. ఇప్పుడు వాటిల్లోనూ ఈ ఆగంతకులను అనుమ తిస్తుం డటంతో భద్రత ప్రశ్నార్థకమైంది. సికింద్రాబాద్ వెళ్లే రైళ్లన్నీ అర్ధరాత్రి వేళ సత్తెన పల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లకు చేరుకొంటుంటాయి. ఆ సమయంలోనే ప్రయాణికులు కాస్తంత కునుకు తీస్తుంటారు. అప్పుడు దోపిడీ దొంగలు నిర్మానుష్య ప్రదేశంలో చైన్ లాగి.. రైలుని ఆపి దోచుకోవడానికి ప్రయత్ని స్తున్నారు. సకాలంలో ఆర్‌పీఎఫ్ గార్డులు స్పందిస్తే సరి.. లేకుంటే ప్రయాణికుల సొ త్తుని భారీగా దోచుకొంటున్నారు. ఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోతే ప్రయాణికుల ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రానా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

వరద నీటి నిర్వహణ..

పర్యాటక ఆకర్షణ

(5వ పేజీ తరువాయి)

నిర్వహణలో ఈ రిజర్వాయర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. కాగా శాఖమూరు రిజర్వాయర్‌ను కేవలం రిజర్వాయర్‌గానే కాకుండా పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ ప్రయత్నిస్తోంది. ఫ్లవర్ గార్డెన్, క్రాఫ్ట్ బజార్, అమ్యూజ్‌మెంట్ పార్కు, మ్యూజికల్ ఫౌంటేన్, లేజర్ షో ఏర్పాటు చేయడంతోపాటు, రిజర్వాయర్లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దాంతోపాటు వాకింగ్ ట్రాక్, యోగా, మెడిటేషన్ హాళ్లను కూడా ఏర్పాటు చేయాలని సీఆర్డీఏ నిర్ణయించింది.

పూర్తయిన పూడికతీత

50 ఎకరాల్లో నిర్మిస్తున్న శాఖమూరు రిజర్వాయర్ పూడిక తీత పనులు నూరుశాతం పూర్తయ్యాయి. వరద నీరు రిజర్వాయర్‌లోకి రాకుండా మట్టితో ఆనకట్టలు కట్టి అడ్డుకుంటున్నారు. కాగా.. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో స్వల్పంగా నీరు చేరింది. ఆ నీటిని మోటార్లతో తోడుతూ పనులు కొనసాగిస్తున్నారు. రిజర్వాయర్‌కు ఫస్ట్ లెవెల్ కాంక్రీట్ ఫౌండేషన్ పనులు దాదాపు తుది దశకు చేరాయి. తొలి దశ ఫౌండేషన్ పనుల్లో భాగంగా వాటర్ ప్రూఫ్ షీటు అమర్చి, దాని మీద గ్యాబిన్ మెస్ ఏర్పాటు చేసి దాంట్లో రాళ్లు నింపి ఫౌండేషన్ లేయర్‌ను రూపొందించారు. ఈ పనులు తుది దశలో ఉన్నాయి. ఈ వారంలో అది కూడా పూర్తవుతుందని నిర్మాణ సంస్థ చెబుతోంది. కాగా పార్కు చుట్టూతా ఫెన్సింగ్ ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి.

వెల్డింగ్ దుకాణంలో ఇనుప వస్తువులు చోరీ

నాగులుప్పలపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇనుప సామాన్లు చోరీకి పాల్పడిన మహిళా దొంగలను అడ్డుకొన్న వ్యక్తిపై దాడికి తెగబడ్డారు. తీవ్రంగా గాయపరిచారు. సమాచారం అందుకొన్న పోలీసులు మహిళా దొంగలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు..ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వేటపాలెంకు చెందిన తల్లి,కుమార్తెలైన దేవర కోటమ్మ, పెదాల లక్ష్మీ సోమవారం తెల్లవారు జామున ఉప్పుగుండూరు గ్రామంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద నున్న ఓ వెల్డింగ్ దుకాణంలో ట్రాక్టర్ సామాన్లు చోరీ చేసి తరలిస్తున్న క్రమంలో అడ్డుకొన్న గ్రామానికి చెందిన గోగినేని కృష్ణపై దాడికి పాల్పడ్డారు. దాంతో కృష్ణ కాలికి సైతం గాయమయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకొని మహిళా దొంగల వద్ద నున్న పెద్దసైజు గోతాలను తనిఖీ చేయగా ట్రాక్టర్ ట్రక్‌కు తగిలించే ఇచ్చితో పాటుగా మరికొన్ని ఇనుప వస్తువులు లభించాయి. దీంతో వారిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

మహిళా దొంగల్లో ఒకరైన లక్ష్మీ భర్త గోపి కూడా చోరుడిగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన ఇద్దరు మహిళా దొంగలు గ్రామాలలో చోరీ చేసిన సామాన్లను ఒక చోట ఉంచి ఊరిబయట ఆటోలో వేచిఉన్న గోపికి ఫోన్‌లో సమాచారం అందించి ఆఆటోలోనే వేసుకొని ఉడాయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకమిషన్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాలు చేర్పులు, మార్పులు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోనే విధంగా పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఓటుకు ఆధార్‌అనుసంధానం కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధనరెడ్డి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు ఎస్, జాన్సన్, కుమార్, వరకుమార్, ఎంవీ సత్యనారాయణ, కే రవీంద్రారెడ్డి, ఎన్నికల సెల్‌సూపరిటెండెంట్ రాజ్యలక్ష్మి, ఒంగోలు తహసీల్దార్ మధుసూదన్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు ఎస్‌కే రసూల్, రమేష్, డీఎస్ క్రాంతికుమార్, తదితరులు ఉన్నారు.

వైభవంగా ప్రేమవాహిని రథోత్సవం

చినగంజాం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శతజయంతి దినోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహిస్తున్న సత్యసాయి ప్రేమప్రవాహిని రథోత్సవ కార్యక్రమం చినగంజాం మండలంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. సోపిరాల రైల్వేగేటు వద్ద రథోత్సవానికి మండల సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు, మహిళా సేవాదళ్ సభ్యులు పూర్ణకుంభం, వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా సేవాసమితి మండల కన్వీనర్ మాజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా రథోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 23న సత్యసాయిబాబా జయంతి వేడుకలు అధికారంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. గ్రామంలోని పలువీధుల్లో సంకీర్తనలు అలపిస్తూ, మహిళల కోలాటంతో రథోత్సవాన్ని నిర్వహించారు. రథానికి భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో మండల సేవాదళ్ సమన్వయకర్త ఎం.రఘురామ్, మహిళా కోర్డినేటర్ లలితిమ్మ, యూత్‌లీడర్ ఈశ్వర్‌రెడ్డి, సేవాసమితి సభ్యులు బొమ్మిశెట్టి బాలకోటేశ్వరగుప్త, మునలయ్య, శ్రీరామ చంద్రమూర్తి, మహిళాసేవాదళ్ సభ్యులు మాజేటి లక్ష్మీప్రసన్న, భక్తులు పాల్గొన్నారు.



చినగంజాంలో రథోత్సవానికి స్వాగతం పలుకుతున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఇంకొల్లు : సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న 'సత్యసాయి ప్రేమ ప్రవాహిని' రథయాత్ర సోమవారం ఇంకొల్లు చేరుకుంది. ఇంకొల్లు సత్యసా యి భజన మండలి ఆధ్వర్యంలో మహిళలు రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తి నుండి ప్రారంభించిన రథయాత్ర బాపట్ల జిల్లాలో మూడు రోజులుగా సాగు తోంది. సోమవారం ఇంకొల్లు చేరు కుంది. పర్చూరు రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి సాయిబాబా గుడి వరకు భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. సత్యసాయి భజన మండలి బృందం గోరంట్ల పద్మజ, కరి చిరంజీవి, కరి లక్ష్మణ బాబు, రాధామాధవి, భవాని, విశ్వహిందూ ధర్మపరిషత్ కార్యకర్త లు నార్నె సోమేశ్వర రావు, హనుమంతరావు, మహిళలు పాల్గొన్నారు.



ఇంకొల్లులో రథయాత్ర

అద్దంకి : సత్యసాయి ప్రేమప్రవాహిని రథ యాత్ర సోమవారం రాత్రి అద్దంకి పట్టణం నుంచి సాగింది. సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా సత్యసాయి సేవా సమితీ ఆధ్వర్యంలో చేపట్టిన రథ యాత్ర సోమవారం సాయంత్రానికి అద్దంకి చేరు కొంది. గరటయ్యకాలనీ వద్ద ప్రారంభమైన రదయాత్ర భవానిసెంటర్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీబొమ్మ కూడలి, పోస్టాఫీస్ మీదుగా బాబామందిరం వరకు సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో రథయాత్రను తిలకించారు. సత్యసాయిబాబా సేవాసమితి అద్దంకి శాఖ కన్వీనర్ చిన్ని శ్రీహరిరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

● ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

చీమకుర్తి,జూన్30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే విధంగా మార్పులు చేపట్టడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు.చీమకుర్తి పట్టణంలో 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, గాంధీనగర్, క్రిస్టియన్ పాలెంలో 100 కేవీ ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం సాయంత్రం బీఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణలు చేపట్టి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయటం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ మాకినేని హరిబాబు,ఏడీఈ మోహనరావు, ఏఈలు చంద్రశేఖర్, శ్రీనివాసరావులు టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్,ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, గొల్లపూడి కోటేశ్వరరావు, కందిమళ్ల గంగాధరరావు, తాతినేని రాము,నర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఆర్‌పీలకు ట్యాబులు పంపిణీ

చీమకుర్తి మున్సిపాల్టి పరిధిలో మెప్మా ఆర్‌పీలకు ట్యాబుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదమహిళలు ఆర్థికంగా ఎదిగేవిధంగా ఆర్‌పీలు సహకారం అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆగంతకులకు రాచమార్గం

(5వ పేజీ తరువాయి)

ప్రదర్శిస్తున్నారు. తాజాగా ఆదివారం వేకువజామునకు ముందు పిడుగురాళ్ల, తుమ్మలచెరువు మధ్యన విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి జరిగిన ప్రయత్నంలో పోలీసులు జరిపిన కాల్పుల ఉదంతం.. రైల్వేలో భద్రతపై మళ్లీ అనుమానాలను రేకెత్తిస్తోంది.

ఈఎఫ్‌టీలో నిబంధనకు నీళ్లు..

బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి యువకులు పనుల కోసం ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. వీళ్లంతా ఎక్కువగా విశాఖ, ఫలక్‌నూమా, అమరావతి, ప్రశాంతి, సిల్వార్, ఎల్‌టీటీ, భావనగర్, నాగర్‌సోల్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణిస్తుంటారు. రిజర్వేషన్ చేసుకొంటే వాళ్ల వివరాలన్ని రైల్వే డేటాలో రికార్డు అవుతాయి. దాంతో ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే జనరల్ టిక్కెట్ తీసుకొని స్లీపర్, ఏసీ త్రీటైర్‌లో ఎక్కేస్తుంటారు. భోగీల్లో ఖాళీలు లేకపోతే టీటీఈలు వీళ్లని తదుపరి రైల్వేస్టేషన్‌లో దింపేయాలి. ఒకవేళ ఖాళీలు ఉంటే ఈఎఫ్‌టీ రాసి అందులో ప్రయాణికుల పేర్లు, మొబైల్ నంబర్లు నమోదు చేయాలి. దాని వల్ల ఐడెంటిటీ అనేది పక్కాగా అందుబాటులో ఉంటుంది. అయితే టీటీఈలు ఈ పని చేయడం లేదు. బెర్తులు ఖాళీలు లేకపోయినా ఈఎఫ్‌టీ రాస్తున్నారు. అందులోనూ వివరాలు సరిగా నమోదు చేయడం లేదు. దీని వల్ల రైళ్లలో ఏదైనా నేరం జరిగినా నేరస్తులను గుర్తించడం కష్టతరమవుతోంది.

ఆగంతకులకు ఆహ్వానం..

ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు టిక్కెట్ కలెక్టర్లు కొన్ని ప్రధానమైన స్టేషన్లలో రైళ్ల బోగీల వద్ద బయట ఉండి ఈఎఫ్‌టీలు రాసి లోపలికి అనుమతిస్తున్నారు. పైన పేర్కొన్న ఏ రైలు గుంటూరు వచ్చినా స్లీపర్ క్లాస్‌లో కాలు పెట్టడానికి కూడా ఖాళీ ఉండదు. చాలా మంది జనరల్ టిక్కెట్లతో.. ఫుట్ బోర్డు, టాయ్‌లెట్స్ వద్ద కూడా కూర్చుని ఉంటారు. గతంలో ఏసీ త్రీటైర్‌లో కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులనే అనుమతించే వారు. ఇప్పుడు వాటిల్లోనూ ఈ ఆగంతకులను అనుమతిస్తుండటంతో భద్రత ప్రశ్నార్థకమైంది. సికింద్రాబాద్ వెళ్లే రైళ్లన్ని అర్ధరాత్రి వేళ సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లకు చేరుకొంటుంటాయి. ఆ సమయంలోనే ప్రయాణికులు కాస్తంత కునుకు తీస్తుంటారు. అప్పుడు దోపిడీ దొంగలు నిర్మానుష్య ప్రదేశంలో చైన్ లాగి.. రైలుని ఆపి దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సకాలంలో ఆర్‌పీఎఫ్ గార్డులు స్పందిస్తే సరి.. లేకుంటే ప్రయాణికుల సొత్తుని భారీగా దోచుకొంటున్నారు. ఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు వీటిపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోతే ప్రయాణికుల ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్‌కు ఉత్తమ సేవా అవార్డు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్ ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ శరత్ చౌదరీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీచ్ క్లీనింగ్, మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌లు పంపిణీ, అలాగే కెరీర్ గైడెన్స్ చార్ట్, క్యాన్సర్ రోగులకు మనో ధైర్యం కల్పించే అవగాహన కార్యక్రమాలు, ఆడపిల్లలకు విద్య ప్రాధాన్యతపై సెమినార్‌లు, ఎంపవర్డ్ ఉమెన్, అలాగే దివ్యాంగులకు వీల్ చైర్స్ బహూకరణతోపాటు, వివిధ సేవా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్ చురుగ్గా పాల్గొనడంపై అవార్డులు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలు ఈ అవార్డులకు పోటీ పడగా, రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్‌కు లభించింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు బండారు లక్ష్మీ నారాయణ, సురేంద్ర బాబు, కోగంటి గోపాల కృష్ణ, రావి పాటి శ్రీనివాసరావు, గుమ్మడి శ్రీధర్‌లకు అవార్డును అందజేశారు.



అవార్డు అందుకుంటున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

చిత్రజ్యోతి

SINCE 1965

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రానా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

అవీ..ఇవీ..

శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే ముఖ్యం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వేటపాలెం(చీరాల), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి బిడ్డ ఆరోగ్యంలో తల్లిపాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని వేటపాలెం ఎంఈవో జేవీ సుబ్బయ్య అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి పోటీలు నిర్వహించారు. శిశువల సంరక్షణలో తల్లిపాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ , పెయింటింగ్ పోటీల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఉమ్మిశెట్టి వేణుగోపాలరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ, పోతురాజు, పద్మజ, బ్రహ్మానందరెడ్డి, నాగ సునీత, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తవిద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వేమవరం, మల్లాయపాలెంలలో మంగళవార ఉదయం 8-30 గంటల నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని మార్టూరు డీఈఈ సురేంద్రబాబు తెలిపారు. ఆయా పరిధిలోని పరిశ్రమల నిర్వహకులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళా సర్పంచులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకి, జూన్30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి నిర్ణయాలు తీసుకోవడంలో మహిళా సర్పంచులు కీలకంగా వ్యవహరించాలని, అద్దంకి ఎంపీడీవో శింగయ్య అన్నారు. అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, పంగులూరు, కొరిశపాడు, మార్టూరు మండలాలలోని మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో శింగయ్య మాట్లాడుతూ మహిళా సర్పంచులు గ్రామాల అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. రిసోర్సుపర్సన్లు మహిళా సర్పంచులు విధులు గురించి వివరించారు.

విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి కృషిచేయాలి



పంగులూరులో విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కరకరత్నాచారి

పంగులూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం కోసం సంఘ ప్రతినిధులు కృషి చేయాలని అన్నదానసత్ర అధ్యక్షులు కరకరత్నాచారి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో సంఘ నూతన కార్యలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మచ్చ శేషాచారి, చందు, కన్వీనర్ రాజశేఖర్, సాంబశివరావు, సురేష్, రవిచంద్ర, మల్లికార్జునరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం రామారావు

చినగంజాం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కడవకుదురు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు కుర్రా రామారావు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ సచివాలయంలో, కడవకుదురు పీఈఎస్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంపై సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలను బడిలో చేర్పించడానికి గ్రామ స్థాయిలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల విద్యాశాఖ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని రామారావు అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న తల్లకి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు తదితర పథకాలపై గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో డ్రాపౌట్లు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఎన్.సునీల్, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు కేశన అంజిబాబు, కిశోర్‌బాబు, మోటుపల్లి, కడవకుదురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీబైపాస్ పొడిగింపుపై కసరత్తు

- అవసరమైన సర్వే చేయాలని అధికారులకు మంతి రవికుమార్ ఆదేశం
- గుండ్లకమ్మ ముంపు గ్రామాల సమస్యలపై కూడా చర్చ



మంత్రి రవికుమార్‌కు మినీబైపాస్ సమస్యను వివరిస్తున్న మణికేశ్వరం గ్రామస్థులు

అద్దంకి, జూన్30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని నామ్‌రోడ్డులో ట్రాఫిక్‌ను కొంత మేర తగ్గించేందుకు ప్రతిపాదించిన మినీ బైపాస్ రోడ్డు పొడిగింపునకు అవసరమైన భూసేకరణపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని మంత్రి రవికుమార్ ఆదేశించారు. సోమవారం అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కేఎస్‌బీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన మంత్రి రవికుమార్ స్థానికులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రలతో మినీ బైపాస్ రోడ్డు పూర్తిస్థాయిలో నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సర్వే చేయాలన్నారు. మొదట విడతలో కాకాని పాలెం నుంచి నామ్ రోడ్డు వరకు కాలువ కట్ట అభివృద్ధిపై చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు రవీంద్ర వివరించారు. రెండవ విడతలో కాకానిపాలెం నుండి టిడ్కో ఇళ్ల మీదగా, శింగరకొండ సమీపంలో నామ్ రోడ్డు వరకు పొడిగింపు విషయమై చర్చించారు. అద్దంకి మేజర్ కాలువ కట్టలను రెండు వైపులా రోడ్లుగా మార్చడంతో పాటు టిడ్కో ఇళ్లకు కాలువకట్టకు మధ్యలో కొంత మేర రైతుల నుంచి భూమిని సేకరించాల్సి ఉండడంతో సర్వే చేసి నివేదిక అంద జేయాలని తహసీల్దార్ శ్రీచరణ్‌ను ఆదేశించారు.

ముంపు గ్రామాలపై దృష్టి సారించాలి

గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురవుతున్న మణికేశ్వరంలో ఎస్సీకాలనీ వాసులకు ఇంకా ఇళ్లస్థలాలు ఇవ్వకపోవడాన్ని సోమవారం చిలకలూరిపేటలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి రవికుమార్‌ను అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు కరిముల్లా గ్రామస్థులతో కలిసి వివరించారు. వెంటనే రవికుమార్ ప్రాజెక్ట్ ఎస్‌డీసీతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే భూసేకరణ పూర్తి చేసి ఇళ్లస్థలాల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు.

నల్లబర్లీ పూర్తిగా కొనుగోలు చేస్తాం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



మాట్లాడుతున్న ఏలూరి సాంబశివరావు, హాజరైన రైతులు

ఇంకొల్లు, జూన్ 30, (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పండించిన ఏ ఒక్క పొగాకు రైతు ఆందోళన చెందనవసరం లేదని చివరి ఆకు వరకు పూర్తిస్థాయిలో పొగాకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఇంకొల్లులో మార్కెట్‌యార్డులో సోమవారం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. దేశచరిత్రలో రైతుల వద్ద నుండి ప్రభుత్వం వాణిజ్య పంటలను కొనుగోలు చేయడం ఇదే ప్రథమమన్నారు. కొనుగోలుకు పేర్లు నమోదు చేసుకొని అధికారులు కేటాయించిన ప్రకారం పొగాకు బేళ్లను యార్డుకు తెచ్చుకోవాలని సూచించారు. 20 శాతంలోపు తేమశాతం ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దద్దుకూరు, భీమవరం ప్రాంత రైతులు తమ పొగాకును ఇంకొల్లు కొనుగోలు కేంద్రపరిధిలో నమోదు చేసుకొని తెచ్చుకోవాలన్నారు. గత ఏడాది పొగాకు మంచి ధర ఉండడంతో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారన్నారు. ధర పడిపోవడంతో వ్యాపారులు కొనే పరిస్థితి లేదన్నారు. దీంతో సీఎం చంద్రబాబు రైతాంగాన్ని ఆదుకోవాలని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. పొగాకు రైతు అధైర్యపడవద్దన్నారు. కలెక్టరు వెంకటమురళీ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 18 పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఇంకొల్లు కొనుగోలు కేంద్రంలో 8 మంది రైతుల వద్ద నుండి సుమారు 150 బేళ్లను కొనుగోలు చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు, చినగంజాం మండల టీడీపీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పాద వీరయ్య, పొగాకు రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులు ఖాతాల్లో డబ్బులు జయచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విదేశీ మారకద్రవ్యం అత్యధికంగా ఆర్జించే బ్లాక్ బర్లీ పొగాకు ఇప్పుడు సంక్షోభంలో ఉందన్నారు. రైతులను కష్టాల నుండి బయటకు తీసుకు వచ్చేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకుందన్నారు. పారదర్శకంగా ప్రభుత్వం పొగాకును కొనుగోలు చేయిస్తోందన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని వారు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి, మార్క్‌ఫెడ్ డిఎం. కరుణ శ్రీ, ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, ఆర్డీవో గ్లోరియా, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సమష్టిగా ఆలయ పునర్నిర్మాణం

- ముక్తేశ్వరంలో సీతారాముల దేవాలయ నిర్మాణం పూర్తి
- రూ.కోటి వ్యయంతో పూర్తి చేసిన గ్రామస్థులు



ముక్తేశ్వరంలో నిర్మాణంలో ఉన్న సీతారాముల దేవాలయం

బల్లికురవ. జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామప్రజలు సమష్టి కృషితో దాతల సహకారంతో జీర్ణావస్థలో ఉన్న సీతారాముల దేవాలయాన్ని పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఎన్నో దశాబ్దాల క్రితం పూర్వికులు నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులు అందరు నూతన దేవాలయం నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారు. సుమారు. రూ. 1 కోటి రుపాయల విరాళాలతో దేవాలయం రాతి కట్టుబడి దాదాపు పూర్తి చేయించారు. గత ఏడాది నుండి గ్రామంలో దేవాలయ పనులు జరుగుతున్నాయి. గ్రామ ప్రజలు తమకు తోచిన విధంగా విరాళాలు అందజేయగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ పరిసర గ్రామాల నుండి కొంత మేర విరాళాలు సేకరించి దేవాలయ పనులు చేయిస్తున్నారు. సీతారాముల దేవాలయం పనులు 80 శాతం మేర పూర్తి కాగా సేకరించిన విరాళాలు ఖర్చు కావడంతో పనులలో కొంత జాప్యం జరుగుతోంది. అని గ్రామస్థులు తెలిపారు. దేవాలయం ముందు భాగంలో దేవతా మూర్తుల ప్రతిమలను నిర్మించే కొనసాగుతున్నాయి. దేవాలయానికి రంగులు, ధ్వజస్తంభం సమకూరితే ప్రతిష్ఠ మహోత్సవం తేదీని నిర్ణయిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మారుమూల గ్రామంలో కోటి రుపాయలు వెచ్చించి దేవాలయం నిర్మాణం చేపట్టడంపై పలు గ్రామాల నుండి భక్తులు విరాళాలు అందజేస్తున్నారన్నారు.



దేవాలయంపై దేవతా మూర్తుల బొమ్మలను చెక్కుతున్న కూలీలు

జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

మార్టూరు,జూన్30(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో ద్రోణాదుల నుంచి దగ్గుబాడు మేజరులో జంగిల్ క్లియరెన్స్ పనులను సోమవారం టీడీపీ గ్రామ నాయకులు ప్రారంభించారు. ఈ మేజరులో ఇడుపులపాడు రెగ్యులేటర్ నుంచి చిమ్మిరిబండ రెగ్యులేటర్ వరకు 6.6 కిమీ వరకు ఎన్ఎస్‌పీ కాలువ పైన జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. కోనంకి సబ్ డివిజన్ ఎన్ఎస్‌పీ సాగర్ కాలువలో అక్కడక్కడ విపరీతంగా చిల్లచెట్లు, తుమ్మచెట్లు పెరగడంతో ఎగువ నుండి దిగువకు నీటి ప్రవాహం సక్రమంగా రావడం లేదు.దాంతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. జంగిల్ క్లియరెన్స్ పనులు నిమిత్తం నిధుల మంజూరుకు కూడా కృషిచేశారు. ఈ నిదులతో ఇప్పటికే బొల్లాపల్లి సాగర్ కాలువ జీఎస్‌టీ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. అదేవిధంగా దగ్గుబాడు మేజరులో పనులను చేపట్టారు. ప్రస్తుతం సాగర్ నీటి ప్రవాహం ఆగిపోవడంతో కాలువలో చెట్లను తొలగించడం సులభంగా మారింది. అదేవిధంగా మరో వారం రోజులు నాటికి పూర్తిగా జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యే వకాశాలు ఉన్నాయి. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు పెంట్యాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గద్దె అశోక్, నీటి సంఘం అధ్యక్షులు చిన్నం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్లెపోగు జాన్ తదితర నాయకులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు

బల్లికురవ. జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రోడ్ల వెంబడి పడవేసి ఉన్న చెత్తను లారీల ద్వారా తొలగించాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. సోమవారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చెత్తను లారీల ద్వారా నియోజకవర్గ కేంద్రంలో ఉన్న చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ఎవరైన రోడ్ల వెంబడి చెత్త వేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఎవరైన గ్రామాలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలలో మాత్రమే చెత్తను వేయాలన్నారు. అలానే ఇంటి పన్ను వసూళ్ల చేపట్టాలన్నారు. లక్ష్యం మేరకు ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లు చేయించాలన్నారు. అలానే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్లు ఏర్పాటుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు రాతపుస్తకాలు అందజేత

వేటపాలెం(చీరాల), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిషత్ ఎస్‌జెవైసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సుమారు రూ.15 వేలు విలువైన రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలు సాధ్యమని, ప్రతిఒక్కరూ గురుబోధనలు తప్పక ఆలకించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివశంకర్, అసోసియేషన్ ప్రతినిధులు సునీల్, దోగుపర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, పరీక్షలు చేసేవారిపై చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం కార్యాలయంలో సంబంధిత కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాన్‌సెంటర్‌లపై ప్రత్యేకనిఘా ఉంచాలన్నారు. ఏఎన్ఎం, ఆశావర్కర్‌లకు కచ్చితమైన సూచనలు చేయాలని చెప్పారు. రెండో కాన్పులో కూడా ఆడ శిశువుకు జన్మనిచ్చిన వారిపై నిఘా ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యల తప్పవని సూచించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి సలహాకమిటి ఛైర్మన్ డా.రత్న, మన్మోహన్, డా.సుభాషిణి, డా.షణ్ముఖశ్రీ, డా.యాకోబు, డా.బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా సాగిన మున్సిపల్ సమావేశం

అజెండాలోని 15 అంశాలు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, హాజరైన కౌన్సిలర్లు

అద్దంకి, జూన్30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశం సోమవారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని మొత్తం 15 అంశాలను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. సమావేశం సాదాసీదాగా సాగగా, మధ్యలో వైసీపీ కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావులు ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో మినీ బైపాస్ ఎలా అభివృద్ధి చేస్తారని, అద్దంకి కొండ వద్ద డంపింగ్ యార్డులో చెత్త మొత్తం తొలగింపు తరువాత ఆ ప్రాంతాన్ని ఏమి చేస్తారని అడిగారు. దీంతో కమిషనర్ రవీంద్ర సమాధానమిస్తూ ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేసిన తరువాత మున్సిపాలిటీ నుండి 10 సంవత్సరాల కాలంలో విడతల వారీగా బిల్లులు చెల్లిస్తారన్నారు.. అద్దంకి కొండ వద్ద సుమారు 7 ఎకరాలలో ఉన్న డంపింగ్ మొత్తం తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు. ఆ ప్రాంతంలో కొంతభాగంలో మెటీరియల్ రకవరీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు, మిగిలిన ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. అనంతరం పెద్దగా చర్చ లేకపోవడంతో కొద్ది సమయంలోనే సమావేశం ముగిసింది.


రోగులు ఫుల్.. వసతులు నిల్

- పర్చూరు పీహెచ్‌సీలో సౌకర్యాలు కరువు
- పనిచేయని బయో ఎనలైజర్ రక్త నమూనా మిషన్



వైద్యసేవల కోసం ఎదురు చూస్తున్న రోగులు

పర్చూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వసతులు మెరుగు పడడం లేదు. కనీస వసతుల కూడా ఇక్కడ కరువవుతున్నాయి. పర్చూరు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో (బయో ఎనలైజర్) రక్తనమూనా పూర్తి విశ్లేషణ పరికరం అందుబాటులో ఉన్నా అందులో మోటారు పనిచేయక పోవడంతో అలంకారప్రాయంగా ఉంది. దీని వల్ల ఆసుపత్రిలో రోగుల రక్తనమూనా పరీక్షలు అవసరమైన మేరకు చేయలేని పరిస్థితి నెలకొంది. అదే విధంగా ఎక్స్‌రే సమకూర్చినా బిగించ పోవడంతో వినియోగంలో లేని పరిస్థితి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాలు అయిన వారికి ఎక్స్‌రే పరికరం అందుబాటులో లేకపోవడంతో ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయవలసిన పరిస్థితి ఉంది. దీంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్న పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతుండడంతో వారిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వచ్చినా చిన్నపిల్లల వైద్యుడు ఇక్కడ లేడు. దీంతో చికిత్స అందించలేని దుస్థితి. ఇక్కడ పనిచేసిన చిన్న పిల్లల వైద్యులు మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు బదిలీ కావడంతో ప్రస్తుతం ఆపోస్టు ఖాళీగా ఉంది. పర్చూరులో వసతులతో కూడిన ఒక్క ప్రైవేటు వైద్యశాల కూడా అందుబాటులో లేదు. చిన్నపిల్లలకు ఏదైన ఆరోగ్య సమస్య తలెత్తితే పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పేదలు ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉన్నత వైద్యశాఖ అధికారులు తక్షణం స్పందించి ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైనా వైద్య సౌకర్యాలు కల్పించడంతోపాటు, పిల్లల వైద్యుడిని కూడా నియ మించాలని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా అధికా రులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అలంకారప్రాయంగా ఉన్న బయో ఎనలైజర్ రక్త నమూనా మిషన్, తాళం వేసిన ఎక్స్‌రే గది